

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం,24 మే 2025

8 పేజీలు


## నిడదవోలులో 34 మంది బాధితులకు
## రూ.16.20 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- మంత్రి కందుల దుర్గేష్ ఆదేశాలతో చెక్కులు పంపిణీ చేసిన జిల్లా, మండల కమిటీల అధ్యక్షులు
- అనారోగ్యంతో ఉన్నప్పటికీ బాధితులకు చెక్కులు అందజేయాలన్న తపనతో ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసిన మంత్రి కందుల దుర్గేష్



**నిడదవోలు, మేజర్‌న్యూస్ :** అనారోగ్యంతో ఉన్నప్పటికీ బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేయాలన్న తపనతో మంత్రి కందుల దుర్గేష్ నేడు నిడదవోలు నియోజకవర్గంలో చెక్కుల పంపిణీకి చర్యలు తీసుకున్నారు. ఈనేపథ్యంలో మంత్రి కందుల దుర్గేష్ ఆదేశాలతో నిడదవోలు నియోజకవర్గంలో వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతూ చికిత్స పొందిన 34 మంది బాధిత కుటుంబాలకు రూ. 16,20,858 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను జిల్లా, మండల కమిటీల అధ్యక్షులు పంపిణీ చేశారు. ఈమేరకు శుక్రవారం నిడదవోలు లోని మంత్రి కార్యాలయంలో వారికి స్వయంగా చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా బాధిత లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా, మండలకమిటీల అధ్యక్షులుఈ సందర్భంగా వెల్లడించారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న వారిలో నిడదవోలు పట్టణం తీరుగూడెం కి చెందిన ముంగర ఝాన్సీమహాలక్ష్మికి రూ. 45,000, గౌడ వీధికి చెందిన చినిమిల్లి రాజుకు రూ. 43,727, శాంతినగర్ కి చెందిన మర్లపూడి వెన్నెల సిరికి రూ. 25,000, కొండపల్లిజస్వంత్ బాబాకు రూ. 20,000, రామాలయం వీధికి చెందిన పేరూరి రజినీ దేవికి రూ. 52,543, 16వ వార్డుకి చెందిన జ్ఞానదృష్టి వెంకటేశ్వరరావుకి రూ. 84,231, ఇందిరానగర్ కి చెందిన మజ్జి సాయి సతీష్ కు రూ. 53, 923, గవిరిని సుబ్బలక్ష్మికి రూ. 19,790ల విలువైన చెక్కులుఅందించారు. అదే విధంగా నిడదవోలు రూరల్ మండలంలోని కాటకోటేశ్వరం గ్రామానికి చెందిన పోల్నాటి రామయ్యమ్మకు రూ. 46,136, కంసాలి పాలెంకి

- తరువాయి 2లో..



## సంక్షేమ హాస్టళ్లలో వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి..

-పివిజిటి గ్రూపులకు గృహనిర్మాణ పనులు, ఇతర సంక్షేమ పథకాలు విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలి

-జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్:** జిల్లాలోనిసంక్షేమవసతి గృహాలలో అన్నిమౌలిక సౌకర్యాలను కల్పించాలని, స్కూల్స్ ప్రారంభించే నాటికి ఆయా పనులు పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో, అంగన్వాడీ కేంద్రాలలో వసతుల కల్పనపై,పివిజిటి గ్రూపు లకు గృహనిర్మాణపనులు చేపట్టడంపై ఆయాశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగాకలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ..బడి బయట పిల్లలను గుర్తించి, డ్రాపౌట్ లు ఎక్కువగా గల ప్రాంతాల్లో తిరిగి స్కూల్‌లకు వొచ్చేలా వారికి వసతి గృహాలలో సీట్ల కేటాయింపు జరపాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇందు కోసం ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలని, పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. కొవిడ్ సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లల పై ప్రత్యేక దృష్టి సారించి, వారిని హాస్టళ్ల లో చేర్పించాలని చెప్పారు. విడాకులు తీసుకున్న,విదేశాలకు వెళ్లిన మహిళల పిల్లలు, అనురక్షిత వాతావరణంలో ఉన్న ఆడపిల్లలను గుర్తించిహాస్టళ్లలో చేర్పించాలన్నారు. తక్కువ పిల్లలు ఉన్న వసతి గృహాలను

- తరువాయి 2లో..

## జగ్గంపేటలో ప్రభుత్వ ఎన్టీఆర్ అన్న క్యాంటీన్‌కు శంకుస్థాపన చేసిన
## కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్

**జగ్గంపేట,మేజర్‌న్యూస్ :** స్థానిక గోకవరం రోడ్డులోని పంచాయతీరాజ్ అతిథి గృహం వద్ద ప్రభుత్వం ఎన్టీఆర్ అన్న క్యాంటీన్ 61 లక్షల అంచనా వ్యయంతో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతులనవీన్ హాజరైకొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జ్యోతుల నవీన్ మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో నిరుపేదల కడుపు నింపిన అన్న క్యాంటీన్లను వైసీపీ ప్రభుత్వం మూసివేసింది. ఈ పథకం నిలుపుదల

- తరువాయి 2లో..



## ఇంటింటా రేషన్ పంపిణీ రద్దుపై ఆపరేటర్ల నిరసన ..

- ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్
- వ్యక్తులపై కోపంతో వ్యవస్థలను రద్దు చేయడం సమంజసం కాదు
- పిఠాపురం వైసిపి ఇన్చార్జి, మాజీ ఎంపీ వంగా గీత విశ్వనాథ్



**పిఠాపురం,మేజర్‌న్యూస్ :** ఇంటి వద్దకే రేషన్ పంపిణీ వ్యవస్థ రద్దుపై పిఠాపురం స్థానిక బంగారమ్మ రావిచెట్టు సెంటర్ (ఉప్పాడ సెంటర్)లో శుక్రవారం ఎండీయూ ఆపరేటర్లు నిరసన వ్యక్తం చేశారు. కూటం ప్రభుత్వంతీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, ఎండియు వాహనదారులను మోసం చేయొద్దని ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. గతప్రభుత్వం చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం 2027వ సంవత్సరం వరకు తమను విధుల్లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎండీయూ ఆపరేటర్ల సంఘం కాకినాడ జిల్లా అధ్యక్షులు సిద్ధాంతపు రవికుమార్ మీడియాతో మాట్లాడుతూ... కరోనా వంటి కష్టకాలంలో, వరదలు వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు సేవలు అందించామని, కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంకారణంగా సుమారు

- తరువాయి 2లో..

## మాస్టర్ ప్లాన్ అమలుతో
## కోనసీమ తిరుమల వెంకన్న ఆలయానికి మహర్దశ







- ఎమ్మెల్యే బండారు, కమిషనర్ రామచంద్ర మోహన్

**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిచెందినవాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయం లో మాస్టర్‌ప్లాన్ అమలుతో భక్తులకు మరింతగా మెరుగైన సౌకర్యాలు ఏర్పడతాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ లు అన్నారు. శుక్రవారం వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సందర్శించారు. వీరికి డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు స్వామివారి తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్రపటం అందించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా వాడపల్లి ఆలయమాస్టర్‌ప్లాన్‌లో పనులు క్షేత్రస్థాయి లో పరిశీలించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసినవిలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించేందుకు వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వివిధ అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. అలాగే భక్తుల వాహనాలకు పార్కింగ్ ఇబ్బందులు లేకుండా పార్కింగ్ స్థలాలను అభివృద్ధి చేయడంతో పాటు 50 గదులతో వసతి గదుల నిర్మాణము, వాడపల్లి నుంచి

- తరువాయి 2లో..

# సంక్షేమ హాస్టళ్లలో వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

మొదటిపేజి తరువాయి

గుర్తించి హేతుబద్ధీకరించా లని సూచించారు.అన్ని వసతి గృహాలలో టివిలు ఏర్పాటు చేయాలని చెప్పారు. వసతి గృహాలలో చేపట్టి పూర్తయిన పనులకు సంబంధించి వినిమయ ధృవీకరణ పత్రం (యుటిలైజేషన్ సర్టిఫికెట్ల)ను ఇవ్వాలని ఆదేశించారు.

**-పివిజిటి గ్రూపు లకు చెందిన సమీక్ష :**

పీఎం – జన్మాన్ పథకం, ఇతర కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న పథకాల సేవల అమలు చేస్తున్న పురోగతిపై కలెక్టర్ పి ప్రశాంతి సమీక్ష నిర్వహించారు. తూర్పు గోదావరి జిల్లాలో చెంచు కమ్యూనిటీ కి చెందిన 399 మంది జనాభా ఉన్నారనీ, వీరందరికీ ఆధార కార్డు లు , రేషన్ కార్డులు, కుల ధృవీకరణ పత్రం , ఆరోగ్య శ్రీ కార్డులు, ఆయుష్మాన్ కార్డు లు ఉన్నాయా! లేదా! వ్యక్తుల వారిగా సమగ్ర డేటా సేకరణ చేపట్టడం కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. సంబంధిత కార్డులు లేని వారికి వెంటనే సర్టిఫికెట్స్ ఇప్పించేందుకు కావలసిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హత కలిగిన వారికి దివ్యాంగ పింఛన్లు సదరం ధ్రువపత్రాల జారీకి చర్యలు తీసుకోవాలని , స్వంత ఇంటి నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలని, ఇళ్ల స్థలాలు లేని వారికి స్థలాలు కేటాయించాలని ఆదేశాలను ఇవ్వడం జరిగింది. బడి ఈడు పిల్లల ను గుర్తించి అందరిని బడిలో చేర్పించాలి అని, అంగన్వాడీ వయస్సు పిల్లలను అంగన్వాడీ కేంద్రాల కు పంపించే విధంగా చర్యలు , ఒక కిలో మీటర్ పరిధిలో స్కూల్, అంగన్వాడీ కేంద్రం లేకపోతే అటువంటి హాబిటేషన్ లలో వాటిని నిర్మించేందుకు ప్రతిపాదన లు పంపాలని కలెక్టర్ స్పష్టం చేశారు. యువతను గుర్తించి, వారి ఆసక్తి మేరకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ సమావేశం లో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిణి ఎమ్ ఎస్ శోభా రాణి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి కె ఎన్ జ్యోతి, జిల్లా వెనుకబడిన వర్గాల సంక్షేమ అధికారిణి బి శశాంక, ముఖ్య ప్రణాళిక అధికారి/ జాయింట్ డైరెక్టర్ ఎల్. అప్పలకొండ, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె విజయ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు-ఎస్సై చిన్నబాబు

**రాజవొమ్మంగి,మేజర్‌న్యూస్ :** మోటార్ వెహికల్ చట్ట నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ ఐ చిన్న బాబు హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం జడ్డంగి గ్రామంలో పోలీస్ చెక్ పోస్ట్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న ఐదుగురుకు జరిమాన విధించినట్లు ఎస్ఐ తెలిపారు. వాహన దారులకు డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్లు తోపాటు రికార్డులు సక్రమంగా ఉండాలని, అలానే నిబంధనలను పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## డెల్టా కాల్వల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు



**ధవళేశ్వరం, మేజర్ న్యూస్ :** డెల్టా కాల్వల అభివృద్ధి పనులకు రు. 36.9 కోట్లు ఖర్చు తో 877 పనులు చేపట్టినట్టు ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.గోపీనాథ్ మీడియాకి శుక్రవారం ఉదయం తన కార్యాలయంలో వెల్లడించారు.డెల్టా కాల్వలలో గుర్రపు డెక్క తొలగింపు, పూడిక తీయడం, షట్టర్లు రిపేర్లు తదితర అభివృద్ధి పనులను చేపట్టనున్నట్టు ఆయన వెల్లడించారు. తూర్పు డెల్టా ఆయకట్టు పరిధిలోని 159 పనులకు గాను రూ. 6.1కోట్లు, సెంట్రల్ డెల్టా కాల్వల పరిధిలో 177 పనులకు గాను రూ 6.9 కోట్లు, హెడ్ వర్క్స్ డివిజన్ పరిధిలో 40 పనులకు రు.3.5కోట్లు,కాకినాడ డ్రైనేజి విభాగంలో 292 పనులకు రు.10.59 కోట్లు, పెద్దాపురం వై.ఐ.డివిజన్ పరిధిలో 240 పనులకు గాను రు.9.7కోట్లు వెచ్చించి అభివృద్ధి జరపనున్నారు.రానున్న గోదావరి వరదల సీజన్‌లో చేపట్టవలసిన వరద సహాయక చర్యలు పై కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఫ్లడ్‌స్టోర్‌లో వద్ద మెటీరియల్ సిద్ధం చేయడానికి టెండర్లు పిలిచామని ఎస్.ఇ . గోపీనాథ్ వివరించారు.

## పాడి రైతులకి పశువుల దాణా పంపిణి

**పెరవలి, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ద్వారా పాడి రైతులకు కామధేను (కణికలు) రూ 1,110 లు విలువ గల 50 కేజీల బస్తా రైతులకి రూ.555 లు (50%) సబ్సిడీ తో పాడి రైతులకు అందిస్తున్నామని ఖండవల్లి పశు వైద్యాధికారిణి డాక్టర్ సల్మా మేజర్ న్యూస్ కు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పెరవలి మండలంలో తొలి విడతలో ఖండవల్లి,అన్నవరప్పాడు, కొత్తపల్లి అగ్రహారం,నల్లకులవారిపాలెం, కాపవరం గ్రామాల పాడి రైతులకు 72 బస్తాలు పంపిణి కార్యాక్రమం డిసెంబర్ 23వ తేదీ శుక్రవారం ఖండవల్లి పశువైద్యశాల నందు ఖండవల్లి పశు వైద్యాధికారిని డాక్టర్ సల్మా ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, పాడి రైతులు హాజరయ్యారు.

## కడప మహానాడు2025కు భోజన ఏర్పాట్లపై సమీక్ష

**సమావేశం నిర్వహించిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, అమర్నాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ పేరా బత్తుల రాజశేఖర్**

**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** కడపలో ఈనెల 27, 28, 29 తేదీలలో నిర్వహిస్తున్న తెలుగుదేశం పార్టీ మహానాడు 2025 కు 5 లక్షల మంది వరకు అతిథులు వస్తారని వారికి ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణ సంప్రదాయ వంటకాలు వడ్డించేందుకు భోజనాల కమిటీ శుక్రవారం మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, అమర్నాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ తదితర కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించి వంటకాల లిస్టు ఫైనలైజ్ చేసారు. ఈసందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ తెలుగువారి పసుపు పండగ మహానాడు కడపలో కనీ విని ఎరగని రీతిలో నిర్వహిస్తున్నామని మహానాడు నిర్వహణకు19 కమిటీలు వేయడం జరిగిందని భోజనాల కమిటీకి మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, అనగాని సత్యప్రసాద్ మరియు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను వేయడం జరిగిందని వీరందరి ఆధ్వర్యంలో భోజనాలపై సమీక్ష సమావేశం నిర్వహించామని అన్నారు.

## జిసిసి మేనేజర్‌గా గౌరమ్మ

**రాజవొమ్మంగి,మేజర్‌న్యూస్ :** రాజవొమ్మంగి జిసిసి మేనేజర్‌గా కే.గౌరమ్మ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదే కార్యాలయంలో ఇప్పటి వరకు అకౌంటెంట్‌గా విధులు నిర్వహించిన గౌరమ్మకు పదోన్నతి కల్పించారు.

అలానే సీనియర్ సేల్స్ ఉమెన్‌గా సూపర్ బజార్ నిర్వహిస్తున్న డి.మాత య్యమ్మకు కార్యాలయ అకౌంటెంట్‌గా పదోన్నత కల్పించడం జరిగిందని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మేనేజర్ గౌరమ్మ తెలిపారు. ఇప్పటివరకు ఇక్కడ మేనేజర్ గా విధులు నిర్వహించిన విజయలక్ష్మి అడ్డతీగల బదిలీపై వెళ్లారు.

## జగ్గంపేటలో ప్రభుత్వ ఎన్టీఆర్ అన్న క్యాంటీన్‌కు శంకుస్థాపన చేసిన కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్

మొదటిపేజి తరువాయి

ద్వారా వేలాదిమంది నిరుపేదలు, కార్మికులు, కర్షకుల కడుపుకొట్టింది. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ చేయడం జరిగిందని అన్నారు. నియోజకవర్గ కేంద్రం ఏజెన్సీ ముఖద్వారం జగ్గంపేటలో కూడలి ప్రాంతంలో నిత్యం ప్రజలు వివిధ ప్రాంతాల నుంచి వస్తూ ఉంటారని వైద్యం కోసం, వారపు సంతల కోసం వస్తూ చేతిలో డబ్బులు లేకపోవడం, ఇంటి వద్ద క్యారేజీ సమకూర్చలేని పరిస్థితుల్లో ఉన్నవారికి గతంలో టీడీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్ల ద్వారా అతి స్వల్ప ధరకే ఆహారం ఈ అన్న క్యాంటీన్ ఉపయోగపడుతుందని ఉద్దేశంతో నూతన క్యాంటీన్ భవనాన్ని నిర్మించడానికి ఈరోజు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అక్షయపాత్ర ఆధ్వర్యం లో సరఫరా చేసిన ఆహారాన్ని రూ.5కే ఉదయం అల్పాహారం, రూ.5కే మధ్యాహ్నం లంచ్, రాత్రిపూట రూ.5కే డిన్నర్ ద్వారా పేదలకు ఆహా రం అందిస్తుందని నవీన్ అన్నారు.గత మూడున్నర సంవత్సరాలుగా జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ప్రతి సోమవారం ఉచిత అన్న కాంటీన్ నిర్వహిస్తున్నామని నవీన్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, జీను మణిబాబు, మంగ రౌతు రామకృష్ణ, పాండ్రంగి రాంబాబు, దేవరపల్లి మూర్తి, పాలచర్ల నాగేంద్ర చౌదరి, పురం శెట్టి శివాజీ, పబ్లిక్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్ డిఈఈ గంగరాజు, ఏ ఈ సురేంద్ర, బచ్చల సుధీర్, దాపర్తి సీతారామయ్య, ఎమ్మార్వో రమేష్, ఎంపీడీవో చంద్రశేఖర్, పంచాయతీరాజ్ డిఈ ఉమాశంకర్, జేఈ నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటా రేషన్ పంపిణీ రద్దుపై ఆపరేటర్ల నిరసన ..

మొదటిపేజి తరువాయి

18,500 కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదనవ్యక్తంచేశారు. ప్రభుత్వం తక్షణమే ఈనిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. స్థానిక వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ మాజీ ఎంపీ వంగా గీతవిశ్వనాథ్‌కు ఆపరేటర్లు వినతి పత్రాన్ని అందించారు. ఎండియూ ఆపరేటర్లు చేస్తున్న నిరసన కార్యక్రమానికిపిఠాపురం నియోజవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జి,మాజీ ఎంపీ వంగాగీత సంఘీ భావం తెలిపారు. వారితో కలిసి నడిరోడ్డుపై కూర్చుని ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు.ఈసందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ... వ్యక్తులపై కోపంతోనో మరి ఏదైనా కారణంతోనో వ్యవస్థలను రద్దు చేయడం సరైన విధానం కాదన్నారు.మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ వ్యవస్థకు రూపకల్పన చేశారని, ఈ వ్యవస్థ ద్వారా ప్రజలు మెరుగైన ఫలితాలు పొందుతున్నారన్నారు. ప్రజలకు ఇంటి వద్దకే రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న, దేశం మెచ్చిన ఒక అతిపెద్ద వ్యవస్థ రద్దు నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని కోరారు. వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలతో కలిసి ఈ నిరసన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.ఈ నిరసన కార్యక్రమంలోఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమైక్య ఎండియు ఆపరేటర్స్ యూనియన్ (రాష్ట్రఉపాధ్యక్షులు,కాకినాడ జిల్లా అధ్యక్షుడు సిద్ధాంతపు రవికుమార్, జిల్లా ట్రెజరర్ దైవ పాల్, పిఠాపురం మండల అధ్యక్షులు ఆళ్ల సుబ్రమణ్యం, పిఠాపురం మండల ఉపాధ్యక్షులు చాట్ల శ్రీను, యూనియన్ సెక్రటరీ యాదాల అప్పలరాజు, జాయింట్ సెక్రెటరీ చొల్లంగి వీరభద్రరావు,మండల వరప్రసాద్ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఓరుగంటి కోదండరాం, వెంకట రమణ,బాబ్జీతదితరులు పాల్గొన్నారు.

## మాస్టర్ ప్లాన్ అమలుతో కోనసీమ తిరుమల వెంకన్న ఆలయానికి మహర్దశ

మొదటిపేజి తరువాయి

మెర్లపాలెం మీదుగా ఊబలంక సాయిబాబా గుడివరకు ఏటుగట్టుపై తారు రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనను పంపించామని అన్నారు. అలాగే తిరుపతి తరహాలో భక్తులు వేచి ఉండేందుకుకంపార్టమెంట్ విధానాన్ని తీసుకొచ్చేందుకు ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామిఆలయం వలన కోనసీమ ప్రాంతానికి విశేషగుర్తింపులభించిందని,రాష్ట్రంలోనిప్రముఖ పుణ్య క్షేత్రాల వరుసలోవున్నవాడపల్లి వెంకటే శ్వరస్వామి ఆలయాన్ని భక్తులు నుండి సూచనలు తీసుకుని మరింతగా అభివృద్ధి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులు స్వామివారి దర్శనంసులువుగా చేసుకుని వెళ్లేలా తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షులు కరటూరి నరసింహారావు, దేవాదాయ శాఖ ఈఈ దుర్గేష్,డిఈశ్రీనివాస్,తాసిల్దార్‌రాజేశ్వరరావు పాల్గొన్నారు.

# నిడదవోలులో 34 మంది బాధితులకు రూ.16.20 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మొదటిపేజి తరువాయి

చెందినకోయి వెంకటలక్ష్మికి రూ.43,850, తాడిమళ్ళకు చెందిన కాజా వీర వెంకట సత్యనారాయణకి రూ.44,406 ఉండ్రాజవరం మండలం వెలగదుర్రుగ్రామానికిచెందిన సాగివెంకటసుబ్బరాజుకు రూ.30,000, దమ్మెన్నుకు చెందిన గుబ్బల శ్రీనివాస్ గారికి రూ.37,000, కె.సావరంకు చెందిన అబ్బిరెడ్డి నిఖిలవెంకటఅనన్యకి రూ.71,942, నార్ని ఆదిలక్ష్మికి రూ.70,503,జుద్దు రాజేంద్ర ప్రసాద్‌కి రూ.35,000, మోర్తకు చెందిన ప్రగడ పార్వతి గారికి రూ.23,920, మోత్కూరి హరి వెంకటసతీష్‌కు రూ.38,500,పసలపూడికి చెందిన రొంగల నాగమణికి రూ.47, 642,పాలంగికిచెందినకొంటెటి శ్రీనివాసరావుకి రూ.35,000, ఉండ్రాజవరంకు చెందిన బొడ్డు శేషయ్య చౌదరికి రూ.1,38,890, పెరవలి మండలం ఉసులుమర్రుకి చెందిన చౌదల్ల శివ గణేష్ గారికి రూ.35,437, జాలెం శేషు గారికి రూ.43,184, కానూరుకి చెందిన మండపాక వెంకట భ్రమరాంబికకి రూ.30,786, అజ్జరంకి చెందిన గరగడాల సురేష్ కి రూ.51,310, వెంకటరాయపురంకి చెందిన పీత నవ్యశ్రీ గారికి రూ.36,067,కాకరపర్రుకి చెందిన అన్నదేవర నాగలక్ష్మికి రూ.23,920,కాపవరంకి చెందిన పసుపులేటి వెంకటరమణకి రూ.20,863, ముక్కామలకి చెందిన నిడదవోలు కాశి జగదీశ్వరి కి రూ.37,500, మల్లేశ్వరంకి చెందిన కోటిపల్లి వెంకట రత్తయ్యకి రూ.35,944, ఖండవల్లికి చెందిన అడ్డగర్ల రాజబాబుకి రూ.25,166ల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. మరికొందరు బాధితులు నేరుగా అమరావతి సచివాలయంలో అందుకున్నారు

# ఎ.సి.ఎ. నిధులు దారిమళ్ళింపు




**– ది ఈస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు ఆరోపణ**

**కాకినాడ, మేజర్‌న్యూస్** : జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి ఏర్పాటు చేసిన ది ఈస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ప్రతిభ గల క్రీడాకారుల భవిష్యత్తును కాలరాస్తు గత నాలుగు సంవత్సరాలలో ఎ.సి.ఎ. నుండి వచ్చిన సుమారు 80 లక్షల రూపాయల నిధులు దారిమళ్ళించారని క్రికెట్ అసోసియేషన్ సభ్యులు డా. శివకుమార్, బాపిరాజు, సత్యస్వరూప్, నగేష్ లు ఆరోపించారు. కాకినాడ జయా రెసిడెన్సీలో ది ఈస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం ప్రెసిడెంట్ డా. శివకుమార్ అద్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఈస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్‌లో గల వివిధ జోన్ల నుండి ప్రెసిడెంట్, సెక్రటరీలు హాజరైయ్యారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ డా. శివకుమార్ మాట్లాడుతూ గత 4 సంవత్సరాలుగా అసోసియేషన్లో జరుగుతున్న అవినీతి అక్రమాలను సభ్యుల ముందు ఉంచేందుకు సమావేశం ఏర్పాటు చేసి సభ్యుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. గత 4 సంవత్సరాలలో ఏ ఫార్మట్లోను టోర్నమెంట్ నిర్వహించకపోగా క్రీడాకారులు వారి ప్రాక్టిస్ నిమిత్తం ఇతర టోర్నమెంట్లలో పాల్గొంటే వారిని పక్కన పెట్టడం వంటి నియంతృత్వ ధోరణుల కారణంగా క్రీడాకరులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా ప్రతిభను పక్కన పెట్టి ఎవరైతే డబ్బులు ఇస్తే వారిని జట్టులో వేయడం వంటి అనైతిక ధోరణులకు స్వస్తి పలికేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అసోసియేషన్ కాలపరిమితి ఆగష్టుతో ముగియనున్న నేపథ్యంలో ఎన్నికలకు తేదీని ఖరారు చేసింది. అసోసియేషన్ నియంతృత్వ ధోరణి కారణంలో జిల్లాలో క్రికెట్ క్రీడాకారుల భవిష్యత్ కుంటుపడిన నేపథ్యంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ జోక్యం చేసుకుని అసోసియేషన్లో నెలకొని ఉన్న అవినీతి అక్రమాలపై విచారణ జరిపించి దోషులపై చర్యలు చేపట్టాలని కోరుతూ తీర్మానం చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల నుండి సుమారు 40 మంది సభ్యులు హాజరై తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో మాజీ సెక్రటరీ కె.బాపిరాజు, మాజీ వైస్ ప్రెసిడెంట్ ఎ.ఎస్. స్వరూప్, రాజమండ్రి ఇన్చార్జి విజయకుమార్ బాబు, కోనసీమ ఇన్చార్జి ఎ.వి.టి.వర్మ, పెద్దాపురం ఇన్చార్జి ఎ. లక్ష్మీనారాయణ, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

# కవిత పరిచయం

కవిత అనేది భావాలను, ఆలోచనలను, లేదా కథను వ్యక్తీకరించడానికి ఉపయోగించే ఒక రచన. ఇది సాధారణంగా పద్య రూపంలో ఉంటుంది.కానీ అది వచన రూపంలో కూడా ఉండవచ్చు. కవితలు పదాలను ఎంచుకోవడం ద్వారా మరియు వాటిని ఒక నిర్దిష్ట శైలిలో అమర్చడం ద్వారాభావోద్వేగాలను సృష్టించగలవు. అలా తోట సుబ్రమణ్యం వ్యక్తీకరించిన రచించిన కవితను ఇక చదవండి మరి..

**మతమా మానవత్వతా – ఏది ముఖ్యము నా భారతీయుడా**

నా దేశం ఉడికిపోతుంది, నా దేశం మండిపోతుంది
ఈ దేశంలో జన్మించినందుకు పరవశించిపోయాను,
ఎందరో మహానుభావుల త్యాగానికి పులకరించిపోయాను,
పేద దేశమైన విలువలలో, సామరస్యతలో ధనిక దేశమని పరమానందించాను,
ఏముంది నా దేశానికి
ఏమయింది నా దేశ ప్రజలకి
మతము మనుష్యులలో చిచ్చు రగుల్చుతుందా లేక
మనుష్యులే మతము పేరిట చిచ్చు రగుల్చుతున్నారా?
ఏది సత్యము?
ఏమయింది మన దేశస్తులకి?
ఎందుకు మానవత్వమును మరచినారు?
ఎందుకు అభిమతమును విడిచిపెట్టినారు?
దేనికోసం! ఎవరికోసం!
ఆత్మసంతృప్తి లేని కార్యములు ఎవరి నిమిత్తం?
అయ్యో జంతువులే మేలని భావించే అనేక నేటి సందర్భాలు!
పరమనిషిని ప్రేమించలేని ఈ మతాలెందుకు?
మానవునిచే సృష్టించబడిన మతం మానవుని కడతేర్చనేల?
మతమనేది దేవునియొద్దకు మార్గముగా ఏర్పరచబడితే,
చివరకు ఆ మతఛాందసవాదమే దైవసేవగా మారిపోయింది!
మతమా ముఖ్యము లేక మానవుడా ముఖ్యము?
ఆలోచించు నా భారతీయుడా ఆలోచించు!
భారతదేశ భవిష్యత్తు నీ చేతులలోనే వుంది అని మరవవద్దు.

**మనకు కావలసినది దైవమే గాని మతము కాదని**
**గ్రహించు నా భారతీయుడా!**

# జి.పి.టి. కంప్యూటర్ ల్యాబ్‌కు రూ.5 లక్షల విలువైన కంప్యూటర్ ఉపకరణాలు అందజేత

**– ఆర్కెసియం ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సేవలు అభినందనీయం**
**– జెఎన్టీయుకె విసి ప్రసాద్, రోటరీ ప్లాస్ట్ గవర్నర్ టిక్కు**



**కాకినాడ, మేజర్‌న్యూస్** : జి.పి.టి. కంప్యూటర్ ల్యాబ్‌కు సుమారు 5 లక్షల రూపాయలతో కంప్యూటర్ టేబుల్స్ చైర్స్ అందించిన ఆర్కెసియం ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సేవలు అభినందనీయం అని జె.ఎన్.టి.యు.కె. వైస్ చాన్సిలర్ ప్రొ. ప్రసాద్, రోటరీ పాస్ట్ గవర్నర్ టిక్కు పేర్కొన్నారు. కాకినాడ జి.పి.టి.లో ఆర్కెసియం ఇండియా వారి సి.ఎస్.ఆర్.నిధులతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి రోటరీ క్లబ్ కాకినాడ ప్రెసిడెంట్ పోలిశెట్టి ఈశ్వర్రావు అద్యక్షత వహించగా జె.ఎన్.టి.యు.కె. వైస్ ఛాన్సలర్ ప్రసాద్ ముఖ్యఅతిథిగాను, పాస్ట్ గవర్నర్ టిక్కు విశిష్ట అతిథిగాను, ఐ.డి.జి. డా. కళ్యాణ్ చక్రవర్తి గౌరవ అతిథిగా పాల్గొన్నారు. కంప్యూటర్ ల్యాబ్‌ను వి.సి. ప్రొ.ప్రసాద్ రిబ్బన్ కత్తిరించి ప్రారంబించారు. ఈ సందర్భంగా అతిథులు ప్రొ. ప్రసాద్, టిక్కు, డా. కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ జి.పి.టి. ప్రిన్సిపాల్ శంకర్ అభ్యర్ధన మేరకు టేబుల్స్ చైర్స్ ఇవ్వడం జరిగిందని, జి.పి.టి. విద్యార్ధులు కంప్యూటర్ ల్యాబ్ సేవలను సద్వినియోగించుకుని భవిష్యత్‌లో ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడి సమాజానికి సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ బాబీ, ట్రెజరర్ తాడల బుజ్జి, హూస్సెన్ మజ్జిద్, క్లబ్ సీనియర్ మెంబర్ సీతాపతిరావు, కాలేజ్ అద్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఈ నెల 27న ప్రముఖ కార్పొరేట్ సంస్థల ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా



**– నిరుద్యోగులకు సువర్ణ అవకాశం**
**– మంత్రి సుభాష్**

**రామచంద్రపురం, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో ఈనెల 27న ఉదయం9:30 గంటలకు రామచంద్రపురంలోని ఉపాధిభవన్‌లో పలుకార్పొరేట్ సంస్థల్లో నియామకాల కోసం జాబ్ మేళా నిర్వహిస్తున్నారు.ఈ జాబ్ మేళాలో ప్రముఖ కాంసెంట్రిక్స్, డబ్ల్యూ.ఎన్.ఎస్ , ఫాక్స్ కాన్, హ్యుండై మోబిస్ తదితర కంపెనీల ప్రతినిధులు హాజరవుతారు. వైజాగ్ కు చెందిన కాంసెంట్రిక్స్, డబ్ల్యూ.ఎన్.ఎస్. కంపెనీలలో ఏదైనా డిగ్రీ చేసిన 18 నుండి 27 సంవత్సరాల అభ్యర్థులకు సుమారు రూ.16,000లు జీతముతో ప్రాసెస్ అసోసియేట్ ఉద్యోగ అవకాశాలు; బెంగుళూరుకు చెందిన ఫాక్స్ కాన్ కంపెనీలో ఇంటర్, డిగ్రీ చదివిన 18 నుండి 27 సంవత్సరాల స్త్రీ అభ్యర్థులకు రూ.21000లు జీతముతో ప్రొడక్షన్ విభాగంలో ఉద్యోగ అవకాశాలు; పెనుగొండకు చెందిన హ్యుండై మోబిస్ కంపెనీలో ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ చదివిన 18 నుండి 27 సంవత్సరాల పురుష అభ్యర్థులకు ప్రొడక్షన్ విభాగంలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. రామచంద్రపురం కేవీర్ హాస్పిటల్ వెనుకగల ఉపాధి కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించబడునని 'సత్యం వాసంశెట్టి ఫౌండేషన్' చైర్మన్ వాసంశెట్టి సత్యం మరియు ఉపాధి ప్రాజెక్ట్ డైరెక్టర్ రాంకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరములు కోసం 9515481671 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

# ప్రత్యామ్నాయమే మార్గం

**- బి.గౌతమ్ కుమార్**



**అమలాపురం,మేజర్‌న్యూస్** : బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతం కుమార్ శుక్రవారం అమలాపురం ఈదరపల్లి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన బహుజన సంకల్ప సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.జిల్లా అధ్యక్షులు కుసుమ వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆయన మాట్లాడారు. జగన్ ప్రభుత్వం ప్రజల ఆస్తుల అమ్మి ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందని, ఈ విషయం తెలిసి చంద్రబాబు ప్రజలకు మోసపూరిత హామీలను ఇచ్చారని అన్నారు. జగన్ ప్రభుత్వంలో అమలైన సంక్షేమ పథకాలను ఇప్పటివరకు సంకీర్ణ ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు భూమి పంపిణీ చేయకుండా తాత్కాలిక పథకాలతో మభ్యపెడుతూ పేదరికంలోనే ఉంచుతున్నారని, బహుజన సమాజ్ పార్టీ అధికారంలోకి వస్తే పేద ప్రజలకు భూమి పంపిణీ చేస్తామని అన్నారు. రాష్ట్రంలో టిడిపి, వైసిపి, జనసేన పార్టీలకు ప్రత్యామ్నయం బహుజన సమాజ్ పార్టీయేనని ప్రజలు గుర్తెరగాలని కోరారు.ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కొల్లబత్తుల సత్యం, గెడ్డం సంపత్ రావు, అశోక్ ఉమ్మడి జిల్లాల ఈసీ మెంబర్ బత్తుల లక్ష్మణరావు,జిల్లా ఇంచార్జ్ కె.లక్ష్మీ భవాని, ఉపాధ్యక్షులు వాకపల్లి భీమారావు, కార్యదర్శి జాన్ మోసే, అమలాపురం ఇంచార్జ్ పొలమూరి మోహన్ బాబు, జుత్తుగా సత్యనారాయణ, రమణ, నియోజకవర్గాల అధ్యక్షులు ఆకుమర్తి భూషణం, బడుగు భీమేశ్వరరావు, తాడి రాంబాబు, జి.కొత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఆర్అండ్‌బి అధికారుల నిర్లక్ష్యానికి

# నరకయాతన అనుభవించిన ప్రయాణికుడు

- -రోడ్డు ప్రక్కన చెట్టుకొమ్మ తొడలో దిగబడటంతో ఒక వ్యక్తి నరకయాతన
- -ఆపరేషన్ చేయడంతో తప్పిన ప్రమాదం
- -కోలుకుంటున్న బాధితుడు



**పెరవలి,మేజర్‌న్యూస్ :** ఆర్అండ్‌బి అధికారుల నిర్లక్ష్యం ఒక వ్యక్తి ప్రాణాల మీదకు తెచ్చింది. ఇటీవలగాలిదుమారాలకు నిడదవోలు నరసాపురం ఆర్ అండ్‌బి రహదారిపై కొన్ని చెట్లు కూకటివేళ్లతో పీకిలించబడి నరసాపురం ప్రధాన పంటకాలువలో పడ్డాయి. కొన్ని చెట్ల కొమ్మలు విరిగి నిడదవోలు నుండి నరసాపురం వెళ్లే రహదారి పైన పడ్డాయి. ఇవి రోడ్లపై వెళ్లి వచ్చే వాహనదారులకు ప్రమాద కరంగా మారి ఇబ్బంది కలిగిస్తున్నాయని స్థానికులు రహదారిపై వెళ్లే ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. అయినా సంబంధిత అధికారుల కళ్ళకు గంతలు కట్టుకుని ఉండడంతో ఏమాత్రం స్పందన లేదు. తీపర్రు,కాకరపర్రు మధ్య గ్యాస్ గొడౌన్ సమీపంలో ఒక చెట్టు కొమ్మ రోడ్డుపై విరిగిపడి అదే విధంగా ఉండిపోవడంతో కానురుఅగ్రహారానికి చెందిన చిర్రావూరి సూర్యనారాయణ మూర్తి కాలి తొడ భాగంలో కొమ్మ దిగిపోయింది. పెరవలి వైపు నుండి స్వగ్రామం కానూరుఅగ్రహారం వైపు మే 22వ తేదీ గురువారం రాత్రి వస్తుండగా చిమ్మ చీకట్లో రోడ్డుమార్జిన్లో ఉన్న ఈ కొమ్మ కనిపించకపోవడంతో ప్రమాదవశాత్తు మోటార్ సైకిల్ తో సహా కొమ్మపై ఆ వ్యక్తి పడ్డాడు దీంతో ఎండిపోయిఉన్న కొమ్మ ఒక్కసారిగా తొడ భాగంలో నుంచి ఒక వైపు దిగుబడి మరో వైపునకు పొడుచుకుని వచ్చింది. జరిగిన ప్రమాదాన్ని చూసిన తీపర్రు గ్రామానికి చెందిన కొంతమంది యువకులు 108 వాహనానికి ఫోన్ చేయడంతో పాటు ఆయన స్వగ్రామంకానూరు అగ్రహారం గ్రామస్తులకు కూడా సమాచారం అందించారు. చిన్న రంపంతోకొద్దిపాటి కొమ్మను తొలగించినప్పటికీ పూర్తిస్థాయిలో కోయడానికి వీలుకాకపోవడంతో ఆ కొమ్మతో సహా108 వాహనంపై ఆ వ్యక్తిని ఎక్కించారు. ఆ వ్యక్తి వాహనంలో పడుకునేందుకు వీలు లేకపోవడంతో ఇద్దరు వ్యక్తులు ఆ వ్యక్తిని నిలబెట్టి పట్టుకున్నారు. ఆ వ్యక్తి పడుతున్న బాధను చూసి స్థానికులు చలించిపోయారు.

స్థానికులు ముందే హెచ్చరించినా అధికారులకు ఎందుకు పట్టలేదు తెలియదు. దీనికి బాధ్యులైన రోడ్లు భవనాలశాఖ అధికారులపై కఠినచర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అసలు పెరవలి మండలానికి సంబంధించి బాధ్యత వహించవలసిన ఆర్అండ్‌బి అధికారులు ఎవరోఇప్పటివరకు స్థానిక ప్రజాప్రతినిధులకు కానీ అధికారులకు కానీ ఎవరికి తెలియదు అనికొంతమంది ప్రజా ప్రతినిధులు వాపోతున్నారు. పెరవలి మండల సర్వసభ్య సమావేశంలో మండలంలోని రహదారుల పరిస్థితిపై తమ గోడు చెప్పుకుందాం అంటే సదరు సమావేశానికి ఆర్అండ్‌బికి సంబంధించిన అధికారులు ఎవరూ హాజరు అవ్వరని వారు వాపోతున్నారు. పెద్దపెద్ద వృక్షాలు వేర్లతో సహా నరసాపురం ప్రధాన పంటకాలలో పడిపోయాయని కాలువకు నీటి విడుదల చేస్తే కాలువలో పడిపోయిన చెట్లు నీటి ప్రవాహానికి అడ్డు వచ్చి మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని కావున వెంటనే సంబంధిత ఆర్అండ్‌బి అధికారులు ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో ఈ పనులు తక్షణమే చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

# ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యం

### – సమస్యల పరిష్కారానికై ప్రత్యేక శ్రద్ధ వహిస్తా: ఎమ్మెల్యే సత్యానందరావు

**రావులపాలెం,మేజర్‌న్యూస్ :** ప్రజల సమస్యలకు సరైన పరిష్కార వేదిక ప్రజాదర్బార్ అని, ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద సత్యానందరావు ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలకు నేరుగా పరిష్కారం మార్గం చూపేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తానని తెలిపారు. శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో 163 వినతులు వచ్చినట్లు తెలిపారు. సమస్యలను బట్టి వాటి పరిష్కార సమయం ఉంటుందని అన్నారు.



ప్రజలు ఇచ్చిన సమస్యల వినతులు పరిష్కారం అయ్యే వరకు వాటిపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని ఎమ్మెల్యే సత్యానందరావు తెలిపారు.

# గీత దాటితే వేటే...

### -మద్య అధికారుల నైట్ పెట్రోలింగ్



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లాలోని మద్యం షాపులు మరియు రెస్టారెంట్ అండ్ బార్స్ నిబంధనలకు అనుగుణంగా పనిచేసే విధంగా చూడడానికి ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్‌శాఖ రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో నైట్ పెట్రోలింగ్ నిర్వాహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో భాగంగా అన్ని ఎక్సైజ్ స్టేషన్‌లలో ఇన్స్పెక్టర్ మరియు సిబ్బంది వారి పరిధిలో ఉన్న షాపులు మరియు బార్లు అన్ని నిబంధనలు పాటించే విధంగా రాత్రిపూట పెట్రోలింగ్ నిర్వహిస్తారనీ జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి సీహెచ్ లావణ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలియచేసారు. ఇందులో భాగంగా సమయపాలన, విడివిక్రయాలు, ఎమ్మార్పీకి మించి అమ్మకాలు లేకుండా చూడటం, అనధికార సిట్టింగ్లను నివారించడం షాపు పరిసరాలన్నీ శుభ్రంగా ఉంచడం ,షాపునందు రికార్డులు సమర్ధవంతంగా నిర్వహించడం సీసీ కెమెరాల పనితీరును పరిశీలించటం వంటి ప్రధానమైన నిబంధనలో కచ్చితంగా అమలు అయ్యేందుకుచర్యలు పర్యావరణ చెయ్యడం జరుగు తుందని వెల్లడించారు. ఇందుకుగాను ప్రతి కానిస్టేబుల్‌కు మూడు లేదా నాలుగు షాపుల బాధ్యతను అప్పగించడం అయినది. సబ్ ఇన్స్పెక్టర్, ఇన్సపెక్టర్స్ మరియు సహాయ ఎక్సైజు పర్యవేక్షకులు ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తామని తెలియచేశారు .మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు గాను ఎక్సైజ్ "ఐ" అనే మొబైల్ అప్లికేషన్ కూడా త్వరలో ఎక్సైజ్‌శాఖ తీసుకురావడం జరుగుతుందన్నారు. ఈయాప్ ద్వారా మద్యం షాపు మరియు బార్లలో జరిగే అన్ని కార్యకలాపాలను నేరుగా పర్యవేక్షణ చెయ్యడం,ఈ నైట్ పెట్రోలింగ్ కార్యక్రమాన్ని ఉన్నతాధికారులై నటువంటి ఎక్సైజ్ సూపరింటెండెంట్ , అసిస్టెంట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్లు కూడా ప్రత్యక్షంగా పాల్గొని సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడుతెలుసుకోవడం జరుగుతుందన్నారు.మీపరిసర ప్రాంతాల్లో ఎక్సైజ్ నేరాలకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉంటే టోల్ ఫ్రీ నెంబరు 14405కి కాల్ చేసి తెలియజేయవచ్చు అని విజ్ఞప్తి చేశారు. మద్యం షాప్స్‌లలో ఎటువంటి లైసెన్స్ నిబంధనలు ఉల్లంఘించినా, అటువంటి వారిపై చర్యలు తప్పవు అని జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సూపరింటెండెంట్ హెచ్చరించారు.

## ఇళ్ళ స్థలాలకు ధరఖాస్తుల స్వీకరణ

### - తహశీల్దార్ వెంకటలక్ష్మీ



**పెద్దాపురంరూరల్,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం పట్టణ, మండల పరిధిలోని 23 గ్రామాల పరిధిలో అర్హులైనవారు ఇండ్ల స్థలాలు కోరుతూ ధరఖాస్తు చేసుకోవాలని పెద్దాపురం తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హుల నుంచి ఆన్‌లైన్‌లో ధరఖాస్తులు స్వీకరించాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దీనికి సంబంధించి వెబ్‌పోర్టల్‌సిద్ధంచేయడం జరిగిందని, కావున అర్హులైన ధరఖాస్తుదారులు దగ్గరలోని ఆయా సచివాలయాలను సంప్రదించి ధరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

### శ్రీ వనదుర్గ అమ్మవారి ఆలయంలో

# చండీ హోమం



**అన్నవరం, మేజర్‌న్యూస్ :** కాకినాడ జిల్లా అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో క్షేత్ర పాలకురాలిగా విరాజిల్లుతున్న, శ్రీ వనదుర్గ అమ్మవారి ఆలయంలో శుక్రవారం సందర్భంగా ఘనంగా చండీ హోమం నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు,శ్రీవనదుర్గ అమ్మవారిని వివిధ రకముల పుష్పములతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు, వ్రత పురోహితులు అమ్మవారికి శ్రీ సూక్తం, పురుష సూక్తం, మూల మంత్రములు, నవగ్రహ అర్చన నిర్వహించి, 11గంటలకు పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం హోమం నిర్వహించిన భక్తులకు, వేద పండితులు వేద ఆశీర్వచనం గావించగా, ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు ఆలయ ప్రధాన అర్చకులు, ఆలయ అర్చకులు, వ్రత పురోహితులు, దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు దంపతులు, దేవస్థానం చైర్మన్ ఐ.వి రోహిత్, దేవస్థానం అధికారులు, భక్తులు, గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యాశాఖ భవన నిర్మాణానికి నిధులు మంజూరు..

### – ఎమ్మెల్యే బండారు




**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ఎన్నో ఏళ్లగా సొంత కార్యాలయానికి నోచుకోని ఆత్రేయపురం మండల విద్యాశాఖ కార్యాలయానికి రూ.53 లక్షలు నిధులు ప్రభుత్వ మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శుక్రవారం సాయంత్రం వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాశాఖ సిబ్బంది అనేక ఇబ్బందులు పడుతూ ఎంపీడీవో కార్యాలయంలో ఒక ఇరుకు గదిలో విధులు నిర్వహిస్తూ వచ్చారన్నారు. ఈ ఇబ్బందులు గమనించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే నిధులు మంజూరుకు కృషి చేశానన్నారు. ఎట్టకేలకు నిధులు మంజూరు అయ్యాయన్నారు. త్వరలో నిర్మాణ పనులు చేసి వెతలు తీర్చనున్నట్లు చెప్పారు. నిధులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు కూటమి నాయకులు ముదునూరి వెంకటరాజు, కూసంపూడి రామకృష్ణంరాజు, కరటూరి నరసింహారావు, ముల్లపూడిభాస్కరరావు, ఎంఈఓ వరప్రసాదరావులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# అందరి భాగస్వామ్యంతో యోగా అభ్యసన కార్యక్రమాలు



**అమలాపురం,మేజర్‌న్యూస్** : రాష్ట్రాన్ని యోగాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో జిల్లా స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు ప్రత్యేక యోగా అభ్యసన అవగాహన కార్యక్రమాలు నెల రోజులపాటు అందరి భాగస్వామ్యంతో నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా స్థాయి అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించి యోగ అభ్యసన, శిక్షణ కార్యక్రమాల విధి విధానాలు గూర్చి సమీక్షించి విధులు బాధ్యతలను కేటాయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నెలరోజులపాటు యోగా సాధన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జూన్ 21న రికార్డు స్థాయిలో యోగా చేయించాలనే లక్ష్యంలో భాగంగా ప్రతిరోజు ఉదయం 7 నుంచి 8 మధ్య యోగా సాధన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అటు పర్యాటక రంగాన్ని కూడా అభివృద్ధి చేసే క్రమంలో జిల్లాలోని పర్యాటక ప్రాంతాలలోనూ, ప్రముఖ దేవాలయాలలోనూ యోగ కార్యక్రమాలు నిర్వహించాలని పర్యాటక, దేవాలయ సిబ్బందిని ఆదేశించారు. ఆయుష్ విభాగం యోగా శిక్షణ కార్యక్రమాలలో యోగా గురువులు మాస్టర్ ట్రైనీలు ద్వారా వివిధ దశలలో ఐదేసి రోజులు పాటు శిక్షణలను ఇప్పిస్తూ కీలక భూమిక పోషించాలన్నారు. ప్రతి ఒక్కరూ దినచర్యలో యోగాను భాగస్వామ్యం చేయాలని యోగ అభ్యసన సాధన ద్వారా శారీరక మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. మనిషి జీవన నాణ్యతను పెంచేం దుకు శ్రేయస్సు కు యోగా గొప్ప మార్గమ న్నారు. ఇతివృత్తం ఆధారిత యోగా సెషన్స్‌తో పాటు వివిధ పర్యాటక ప్రాంతాలు, ప్రముఖ దేవాలయాల్లో కార్యక్రమాలు ఆహ్లాద వాతావరణంలో నిర్వహించాలన్నారు. ఈ నెలరోజులపాటు యోగాసనాలు అభ్యసనతో పాటు ఆసనాల ప్రదర్శన సూర్య నమస్కార్, ప్రాణాయామం ప్రదర్శన, గ్రూప్ యోగ ఇలా వివిధ విభాగాలలో పోటీలు కూడా నిర్వహించాలన్నారు. జీవితాంతం యోగాన్ని ఆచరిస్తూ జీవన ప్రమాణాలను మెరుగు పరుచు కోవాలన్నారు. యోగ భారతీయ వారసత్వ చారిత్రక సంపదని ఈ సంపదను సద్వినియోగం చేసుకొని శారీరక మానసిక దృఢ త్వాన్ని పొందాలన్నారు. యోగ అభ్యసనను ఏ ఒక్క రోజుకో పరిమితం చేయకుండా జీవితాంతం ప్రతిరోజు ఆచరిస్తూ నూతన ఉత్తేజాన్ని పొందాలన్నారు. నెలరోజుల పాటు వివిధ శాఖలు యోగా కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజల్లో యోగా పట్ల సంపూర్ణమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ నెల 27న మాస్ మీడియాకు యోగాతో అనారోగ్యాన్ని జయించిన, యోగా సాయంతో విజయతీరాలకు చేరిన కథనాలు విడుదల చేయాలని అదే రోజు మాస్ ర్యాలీ అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించాలన్నారు. ఈ నెల 27, జూన్ 3, జూన్ 16 యోగాంధ్రపై క్యాంపెయిన్ పర్యాటకుల ద్వారా చేపట్టాలన్నారు. ఈ నెల 28న మండల స్థాయిలో ర్యాలీలు నిర్వహించాలన్నారు జూన్ 2 వ తేదీ రంగోలి పోటీలు, జూన్ 4 వ తేదీ గ్రామ మున్సిపల్ స్థాయిలలో కార్యక్రమాలు, జూన్ 5 నుండి 7వ తేదీ వరకు స్వయం సహాయ సంఘాలతో, జూన్ 13న రైతుల యోగ, జూన్16వ తేదీ ఫ్యామిలీ యోగ, జూన్ 17వ తేదీ స్పెషల్ యోగ వరుసగా జూన్ 21 వరకు వివిధ యోగా కార్యక్రమాలు చేపట్టాలని సంబంధిత శాఖల అధి కారులను ఆదేశించారు. కార్యక్రమంలో పాల్గొనే ప్రతి ఒక్కరిని యోగా అభ్యాసన కొరకు నమోదు చేయిం చాలని వారంతా సాధన చేసేలా చూడాలని సూచించారు. యోగాను కేవలం ఒక కార్యక్రమంగా కాక మానసిక, శారీరక ఆరోగ్యాన్ని కలిగించే సాధనంగా ప్రతి ఒక్కరు గుర్తెరిగి ఆచరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రాజకుమారి, సిపిఓ వెంకటేశ్వర్లు, డ్వామా పిడి మధుసూదన్ ఆయుష్ మెడికల్ అధికారి విజయ్ కుమారి దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ వి సత్యనా రాయణ, డిఐపి ఆర్ఓ కె లక్ష్మీనా రాయణ డిఇఓ షేక్ సలీంభాష,జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# మరిడమ్మ అమ్మవార్కి బంగారు, వెండి పుష్పాలతో పుష్పార్చన



**పెద్దాపురం,మేజర్‌న్యూస్** : పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు శుక్రవారం ఆలయ అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ ఆధ్వర్యంలో వేదపండితులు మరిడమ్మ అమ్మవారిని బంగారు పుష్పాలు,వెండి పుష్పాలతో ఆసాదులు, వేదపారాయణదారులు, పూజ, అర్చన కార్యక్రమం నిర్వహించారు.అనంతరం పులిహోర ప్రసాద వితరణచేయడం జరిగింది.ఈకార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాద శర్మ,ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి,ఆసాదులు రాయరామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది వెంకటరమణ, గౌరి, వరహాలు, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చేతుల మీదుగా వారణాసి చిత్రం విడుదల

**రావులపాలెం, మేజర్‌న్యూస్** : నవ యువ దర్శకుడు కథారచయిత పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణానికి చెందిన అడబాల రాహుల్ రాయ్ దర్శకత్వం వహించి నిర్మించిన వారణాసి చిత్రాన్ని శుక్రవారం బండారు సత్యానందరావు రావులపాలెం పార్టీ కార్యాలయంలో సినిమా పోస్టర్ రిలీజ్ చేసి సినిమా యూట్యూబ్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ తాను తెలుగు సినీ రచయితల సంఘ సభ్యుడిగా ఉంటూ అద్భుతమైన మెసేజ్ ఓరియెంటెడ్ కథలు అనేకం రాసుకొని ఆ కథలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నానన్నారు. వెండితెరపై మంచి దర్శకుడిగా ఎదగాలన్నది తన కలని అన్నారు. అందుకోసం ముందుగా ఈ డిపెండెంట్ మూవీ "వారణాసి" తన స్వీయ దర్శకత్వంలో నిర్మించానని తెలిపారు. ఇక వారణాసి మూవీ సమాజంలో బాలికలపై జరుగుతున్న దారుణ ఘటనలు, వాటికి తగిన శిక్ష గురించి ఈ సినిమాలో అద్భుతంగా చిత్రీకరించానని చెప్పారు. ఈ సినిమాలో మచిలీపట్నానికి చెందిన కొక్కిలిగడ్డ నరసింహ, కొత్తపేటకి చెందిన పాటల రచయిత కవి కోటిపల్లి రామకృష్ణ, వారి మనుమరాలు జాహ్నవి ప్రధాన పాత్రల్లో నటించగా, శశిదేవి, గూడపాటి బూరయ్య, సాంబమూర్తి మరియు కొత్తపేటకి చెందిన యువకులు కోటిపల్లి దామోదర్, వలపుశెట్టి కిరణ్, నేదునూరి సూర్య కిరణ్, చోడపనీడి ప్రకాశం, కుంచనపల్లి ఆదిత్య, (వాడపాలెం) సూర్య సాధనాల తదితరులు నటీనటులుగా నటించారన్నారు. ఈ సినిమా మొత్తం సామ్‌సంగ్ కంపెనీకి చెందిన గెలాక్సీ ఫోన్ ద్వారా యిలాయి బుడ్డి వెలుగులో చిత్రీకరించడం



కూడా ఈ మూవీ ప్రత్యేకత అని తెలిపారు. ఈ మూవీ చూడాలనుకొనేవారు తీఘ్రబశ్రీతీశీఎశీసవ అనే యూట్యూబ్ ఛానల్‌లో వీక్షించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ భవిష్యత్తులో మంచి మంచి సినిమాలు తీసి దర్శకుడిగా ఎదగాలని దర్శకుడు రాహుల్ రాయ్‌ని మరియు సినిమా టీంని అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కొత్తపేట మండల అధ్యక్షులు గనిశెట్టి వీరేష్ మరియు టిడిపి నాయకులు మరియు చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

## రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి - ఎమ్మెల్యే బండారు



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్** : రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి ఎన్నో కార్యక్రమాలు అమలు చేసి కృషి చేస్తుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం ఆయన జిల్లా ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షులు కరుటూరి నరసింహారావు తో కలిసి మండలంలోని కట్టుగ గ్రామం వద్ద 10 లక్షలతో పునః నిర్మించనున్న అంకంపాలెం డీపీ ఇన్లెట్ కు శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో రైతులకు ఉపయోగించే ఒక్క పని కూడా చేయలేదన్నారు. కోటమి ప్రభుత్వం వచ్చాక సైపన్లు, రక్షణ గోడలు, కాలవ తవ్వకాల పనులు వంటివి చేపట్టడం జరిగిందన్నారు. లొల్ల లాకుల పునర్నిర్మాణానికి రూ.75 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించినట్లు చెప్పారు. అవి మంజూరు దశలో ఉన్నాయన్నారు. ఈ నిర్మాణం పూర్తయితే కోనసీమ అంతటికి సాగు తాగునీరు లోటు ఉండదన్నారు. రైతులకు సంబంధించి ధాన్యం కొనుగోలు చేసి అనధికాలంలోనే సొమ్ము జమ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డిఇ నాగేంద్ర కుమార్, ఏఈ సాయి మాధవ ప్రసన్న, మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు బాబు, పేరవరం నీటి సంఘం అధ్యక్షులు జుజ్జవరపు శ్రీహరి, నాయకులు దొడ్డపనేని త్రినాధ రావు, పేరిచర్ల భీమరాజు తదితరులు ఉన్నారు.

## టిడిపితోనే కార్యకర్తలకు సుముచిత స్థానం



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్** : తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ నుంచి కార్యకర్తలకు సుమునిత స్థానం కల్పిస్తుందని యువ నాయకులు బండారు సంజీవ్ అన్నారు. ఆయన సమక్షంలో శుక్రవారం ర్యాలి గ్రామానికి చెందిన ప్రముఖులు వైసీపీ నుండి వానపల్లి నరసింహమూర్తి, కళ్యాణ్ తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సంజీవ్ మాట్లాడుతూ వైకాపా ప్రజా వ్యతిరేక విధానాలకు గ్రామాల ప్రజలు విసికి వేసారిపోయారన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఆకర్షితులై బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఆగస్టు నుండి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, తల్లికి వందనం కార్యక్రమాలు అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింద న్నారు.ఈకార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మద్దూరి సుబ్బారావు, కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

## శ్రీ సత్యదేవుని నిత్య అన్నదాన పథకానికి రూ.2,00,116లు విరాళం



**అన్నవరం, మేజర్ న్యూస్** : కాకినాడ జిల్లా అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి విజయవాడ వాస్తవ్యులు వెంకట సత్యవాణి దంపతులు రూ.2,00,116లు విరాళంగా దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావుకి అందజేశారు. దీనిపై వచ్చే వడ్డీతో ప్రతి సంవత్సరం జనవరి 1వ తారీఖున అన్నదానం జరిపించాలని దాత కోరారు. దాతను దేవస్థానం అధికారులు అభినందించారు.

# 9వ రోజుకు చేరిన ఆదివాసి దీక్షలు




**చింతూరు,మేజర్‌న్యూస్ :** రంపచోడవరం నియోజకవర్గం చింతూరు మండలం రిలే నిరాహార దీక్షలు 9వ రోజు విజయవంతంగా ముగిసినది. శుక్రవారం చింతూరు ఎంపీపీ సవలం అమల, చట్టి గ్రామానికి చెందిన పెసా కమిటీ కార్యదర్శి పొడియం రామకృష్ణ (రాంబాబు) ఈరోజు దీక్ష ప్రాంగణంలో ముందుగా కొమరం భీమ్, బిర్సం ముండా ఫోటోలకు పూరదండలు వేసి అలాగే దీక్షలో పాల్గొన్న యువతీ యువకులకు పూలమాలవేసి దీక్షను ప్రారంభించారు.దీక్షను ఉద్దేశించి ఆదివాసీలు మాట్లాడుతూ ఆదివాసి పోరాటాలకు రాజకీయ పార్టీలు అడ్డు కాకూడదు అని తెలియజేస్తూ ఇటువంటి పోరాటాల్లో యువతి యువకులు భారీగా పాల్గొని భవిష్యత్తు తరాలకి ఉద్యమ స్ఫూర్తిని నింపుతూ మన హక్కుల సాధనకై అందరూ ఐక్యతతో ముందుకు రావాలని తెలియజేశారు. అలాగే మెగా డీఎస్సీ నుండి ఏజెన్సీ ఆదివాసి టీచర్స్ పోస్టులు మినహాయించి 100% ఉద్యోగాలను ఆదివాసి నిరుద్యోగులతో తోనే భర్తీ చేయాలి అని, అలాగే ప్రత్యేక డిఎస్సిని కూడా విడుదల చేయాలి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు అరకులో ఆదివాసుల సాక్షిగా ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేయాలి అని డిమాండ్ చేశారు. 29 శాఖల్లో ఖాళీగా ఉన్న ఎస్టి బ్యాక్లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, ఐటీడీఏల ద్వారా ట్రైకర్ రుణాలు నిరుద్యోగ యువతీ, యువకులకు మంజూరు చేసి ఉపాధి కల్పించాలని మొదలైన సమస్యల పరిష్కార కోసం ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జేఏసీ పిలుపుమేరకు చట్టి గ్రామ యువతి, యువకులు, రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయడం జరిగింది. దీక్షా కార్యక్రమంలో చింతూరు ఎంపీపీ సవలం. అమల, ఏడుగురాళ్లపల్లి సర్పంచ్ సత్తిబాబు, ఏసి కోడేరు సర్పంచ్ అగరం. సుబ్బలక్ష్మి, ముకునూరు సర్పంచ్ బి.సత్యకుమారి, గంగన్న మెట్ట సర్పంచ్ వేక. ప్రసాద్,తుమ్మల సర్పంచ్, కొవ్వాసి రామారావు, పేగ ఎంపిటిసి సున్నంనాగరాజు, జేఏసీ చింతూరు మండల కార్యదర్శి కాకా సీతారామయ్య. తుర్రం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

---

## కంచి విశ్వవిద్యాలయంలో
# జూన్ 8న స్పాట్ కౌన్సిలింగ్



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** కంచి కామకోటి పీఠం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వ మహా విద్యాలయంలో ప్రవేశానికి జూన్ 8న స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు కంచి పీఠ ప్రతినిధి వేద పురోహితులు ఆకెళ్ళ మురళీకృష్ణ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశానికి విద్యార్థుల నుండి అడ్మిషన్లు ఆహ్వానిస్తూ జూన్ 8న కాకినాడ విద్యుత్‌నగర్‌లోని చల్లా ఫంక్షన్ హాల్‌లో స్పాట్ కౌన్సిలింగ్ విధానాన్ని యూనివర్సిటీ అధికారులు నిర్వహిస్తున్నారని ఆయన వివరించారు. బిఈ, సివిల్, సిఎస్‌సి, ఈసిఈ, ఈఈఈ మరియు మెకానికల్ ఇంజనీర్‌లో స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తారని, ఇతర విద్యా విషయాలు యూనివర్సిటీ అధికారుల నుండి అడిగి తెలుసుకోవచ్చని మురళీకృష్ణ వివరించారు. విద్యానంతరం జాతీయ సంస్థలలో ఎక్సలెంట్ ప్లేస్మెంట్ అవకాశం ఉందని, విద్యార్థులకు స్కాలర్షిప్ సదుపాయం కూడా కలదు అన్నారు. జూన్ 8న జరిగే స్పాట్ కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా విద్యార్థుల పేరెంట్స్‌ను ఆయన కోరారు.

## కోవిడ్ పట్ల ప్రజలు
# అప్రమత్తంగా ఉండాలి



**– డిప్యూటీ డిఎం & హెచ్ఓ డా.పి.సరిత**

**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** కేంద్ర, రాష్ట్ర, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పెద్దాపురం డివిజన్ పరిధిలో ప్రజలు కోవిడ్ మహమ్మారి పట్ల అప్రమత్తంగా ఉండాలని డిప్యూటి డిఎం & హెచ్ఓ డా. పి.సరిత సూచించారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ కొన్ని దేశాలలో కోవిడ్ విజృంబిస్తున్న నేపథ్యంలో రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్‌లు, ఎయిర్‌పోర్ట్‌లలో కోవిడ్–19 నిబంధనలు విధిగా పాటించాలని ఆమె తెలిపారు. 60 ఏళ్ళు దాటిన వృద్దులు, గర్భిణీలు అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రాకపోవడం శ్రేయస్కరమని అన్నారు. చేతులను ఎప్పటికప్పుడు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని, ముఖ్యంగా మాస్క్ ధరించి, సామాజిక దూరం పాటించాలన్నారు. దీని ద్వారా వైరస్‌ను అదుపులో ఉంచవచ్చునని, ఎదుటివారితో కరచాలనం చేయరాదని, తెలిపారు. గాలి, వెలుతురు ఉన్న ప్రదేశాలలో నివసించాలని, అనుమానం ఉన్న వ్యక్తులు సమీప ఆసుపత్రులలోని వైద్యాధికారుల సూచనల మేరకు తగిన మందులు వాడాలన్నారు. విదేశాల నుంచి వచ్చే వ్యక్తులు తప్పనిసరిగా సెల్ఫ్ ఐసోలేషన్‌లో ఉండాలని ఆమె తెలిపారు. జ్వరం, దగ్గు, రొంప, గొంతునెప్పి, నాలుక రుచి లేకపోవడం, తలనెప్పి, ఒళ్ళునెప్పులు, ముక్కు కారడం, వాంతులు, విరోచనాలు వంటి లక్షణాలు కనిపిస్తే సమీపంలోని ప్రభుత్వాసుపత్రిలోసంప్రదించి,వైద్యం చేయించుకోవాలని డిప్యూటి డిఎం & హెచ్ఓ డా. పి.సరిత ప్రజలకు సూచించారు.

## కాకినాడ ఆర్టీసీ డిపోలో ఆకస్మిక తనిఖీలు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ ఆర్టీసీ డిపోలో డిపిటివో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశం ప్రకారం బస్ స్టేషన్‌లో ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపరచుట కొరకై శుక్రవారం కాకినాడ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు క్యాంటీన్, కార్గో సెక్షన్, స్టాల్స్, టాయిలెట్స్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్యాంటీన్లో టిఫిన్ చేస్తున్న వినియోగదారులను ఆయన ఆ టిఫిన్స్ క్వాలిటీపై విచారణ చేసినారు. అలాగే కార్గో సెక్షన్ నందు వినియోగదారులను స్వయంగాఅడిగివారికున్న ఇబ్బందులను తెలుసు కున్నారు. స్టాల్స్ అన్నిటిలో నిర్ణయించిన ధరల పట్టిక ఉండాలని, నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆయన సూచించారు. ప్రయాణికులకు అందించే సేవల మెరుగుదలపై ఆయన డిపో మేనేజర్ మనోహర్‌కి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డిపో మేనేజర్ ఎం.యు.వి.మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ,డిపిటిఓ ఆఫీస్ అసిస్టెంట్ మేనేజర్ ఎస్.కే.ఎం. భాష, పిఆర్వో సిహెచ్.వెంకట్‌రాజు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**రావులపాలెం,మేజర్‌న్యూస్ :** రావులపాలెం మండలం ఊబలంక గ్రామంలో మరియు ఆత్రేయపురం మండలం కట్టుంగ గ్రామంలో గోదావరి డెల్టా కాలువపై కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గన్నవరం కెనాల్ పై కట్టుంగ వద్ద 10 లక్షల రూపాయలతో పునర్మించనున్న అంకంపాలెం డీపీ ఇన్లెట్‌కు శంకుస్థాపన చేశారు. అలాగే ఉబలంక గ్రామం వద్ద డెల్టా కెనాల్ వద్ద పునర్మించనున్న కల్వర్ట్ నిర్మాణానికి ఎమ్మెల్యే సత్యానందరావు శంకుస్థాపన చేశారు.

## తడిచెత్త, పొడిచెత్త విడివిడిగా సేకరించాలి

**– కమీషనర్ శ్రీకాంత్‌రెడ్డి**



**పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం పురపాలక సంఘ పరిధిలో 29 వార్డులలో శానిటేషన్ సిబ్బంది ఇండ్ల నుంచి తడి చెత్త, పొడి చెత్తను వేరు వేరుగా సేకరించాలని, శానిటేషన్ సిబ్బందిని కమీషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కమీషనర్ శానిటేషన్ మేస్త్రీలు, శానిటేషన్ సెక్రటరీలతో పురపాలక సంఘంలో తడిచెత్త, పొడిచెత్త సేకరణపై సమీక్షించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే మెయిన్‌రోడ్డులో వ్యాపారస్థులు చెత్తను రోడ్డుపై వేయకూడదని దానికి సంబంధించి శానిటేషన్ సిబ్బంది వ్యాపారస్థులకు అవగాహన కల్పించాలని పురపాలక సంఘం ఆధ్వర్యంలో సాయంత్రం 8 నుంచి 10 గంటల మధ్యలోమెయిన్‌రోడ్ షాపుల వద్ద శానిటేషన్ సిబ్బందిచే చెత్త సేకరణ నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. దీనిలో భాగంగా ఉదయం కంపోస్ట్ యార్డ్‌ను, సామర్లకోటలోని పంప్‌హౌస్‌ను కమీషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.ఆదినారాయణ,ఏఇ జాన్‌మోజెస్, శానిటరీ మేస్త్రీలు, శానిటరీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

# ఈ అన్నదమ్ముల అనుబంధానికి బలమెక్కువ



గండేపల్లి,మేజర్‌న్యూస్:"ఆబంధంలో తెలియని మ్యాజిక్ ఉంది..కొట్టుకున్నా.. తిట్టుకున్నా ..అందులో ప్రేమ ఉంటుంది చెప్పలేని ప్రేమకు ప్రతిరూపం అన్నదమ్ముల అనుబంధం" నేడు మే 24 జాతీయ అన్నదమ్ముల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం...పచ్చనోటు ముందు పలుచనైపోతున్న బంధాలు ధనదాహం ముందుగుడ్డిదైపోతుంది గుణంఆస్తి,అంతస్థుల ముందు ఆవిరై పోతున్నాయి ఆప్యాయతలు.. నేటి మన ప్రవర్తనే రేపటి తరం మన పిల్లలకు అస్త్రాలుగా మారతాయని భయపడుతున్న తరుణంలో ..ఇప్పటికీ అంతే పచ్చగా ఉన్న బంధాలు.. పెద్దలపైన కుటుంబ వ్యవస్థపైనా అపార ప్రేమాభి మానాలు చూపే గుణం..ఆస్తులు అంతస్తులు కన్నా తన తండ్రి చూపిన ఆధ్యాత్మిక, సేవా మార్గంలోనే ఆప్యాయతలు పంచుతూ విలువలు పెంచుకుంటూ ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు ఈ సోదరత్రయం...ఆయనగణితంలోమేజిక్కులుచేస్తారు.. అంకెలతో ఆటలాడుకుంటూ తన విద్యార్థులకు లెక్కలపై లెక్కలేనంత మక్కువ పెంచుతూ ఎన్నో అవధానాలను తాను చేస్తూ తన శిష్యులచే చేయిస్తూ గణిత మేధావిగా ప్రసిద్ధిగాంచిన గణిత అవధాని, పుస్తక రచయిత, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులుగా రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు పొందిన తోటకూర సాయి రామ కృష్ణ ప్రథముడు. ఆయన తరగతి గదిలోనే కాదు మానవ సంబందాలలోను ఒకలెక్క ఉందని మన తిక్కను ఇతరులపై చూపించకుండా మక్కువతో అక్కున చేర్చుకోవాలని.అందుకు తనకు తెలిసిన లెక్కల పరిభాషలో చూస్తూ అనుబంధాలను కలుపుకుంటూ(ం),రాగద్వేషాలనుతీసివేసి(−)ప్రేమాను రాగాలను హెచ్చువేస్తూ. మంచితనాన్ని పదిమందికి పంచుకుంటే (/)జీవితం నిస్సందేహంగా సఫలీకృతం అవుతుందంటారాయన, తండ్రి చూపిన ఆధ్యాత్మిక బాటలో మూర్తి త్రయ సేవలో ఆనందం వెదుకుతూ సమాజమే తనకుటుంబంగా, ఆస్తిగా భావించి సోదరుల సహకారంతో శ్రీశారదా రామకృష్ణ సేవా సమితి ద్వారా గ్రామంలో సమాజహిత కార్యక్రమాలు చేస్తున్న సమితి అధ్యక్షుడు, ఆదిత్య యూనివర్సిటీ ప్రెస్ రిలేషన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత గంగాధర్ మరొకరు. అన్న మార్గంలో గురు పథంలో కొనసాగుతూ సామర్లకోట మండలం వెంకట కృష్ణరాయపురం గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తూ విద్యా సేద్యం చేస్తూ...విలువలతో కూడిన విద్యను అందిస్తూ యువ భారత నిర్మాతలను తీర్చిదిద్దుతున్నారు టి.వి.వి. సత్యనారాయణ. శ్రీ రామకృష్ణ సేవా సమితి శాశ్వత సభ్యులు టి.వి.వి. పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులుగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపు టీచర్ వెల్ఫేర్ అసోసియేషన్ కాకినాడ జిల్లా నాయకులుగా సమాజానికి తమ అమూల్య సేవలను అందిస్తున్నారు టివివి..ఈసోదర త్రయంగత మూడు దశాబ్దాలుగా వీరి ప్రతీ పుట్టినరోజు నాడు విధిగా మొక్కలు నాటి జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు. తండ్రి తర్వాత తండ్రి లాంటి అన్నయ్య మాటను జవదాటక అన్నను అనుసరించే ఆదర్శ తమ్ముళ్లు కుటుంబపరమైన,ఆధ్యాత్మిక పరమైన,విద్యా పరమైన,సేవా పరమైన ఏ కార్యక్రమం లోనైనా తండ్రిచూపిన బాటను వదలక అన్న వెంటే అనుసరిస్తూ ముందుకు సాగుతున్నారు.వృత్తిలో ఆదర్శవంతంగా నిలిచి ప్రభుత్వమన్న నలతో పాటు జాతీయ అవార్డు సాధించిన సాయి రామకృష్ణ సుగుణ సంపన్నుడైన కొడుకుగా, ప్రేమానురాగాలను పంచె భర్తగా,ఆదర్శవంతమైన తండ్రిగా సౌశీల వంతమైన పౌరుడుగా తన ప్రవృత్తితో నేటి సమాజంలో ఆదర్శవంతంగా నిలిచారు. గంగాధర్ ఇప్పటి వరకు 30సార్లు రక్తదానం చేయడం అభినందనీయం తన పుట్టినరోజు నాడే కాకుండా తన మిత్రుల పుట్టిన రోజులు సైతం మొక్కలు నాటుతూ సమితి ద్వారా లక్షకు పైగా మొక్కలు నాటినందుకు గాను 2019లో ప్రభుత్వం జాతీయ పర్యావరణ మిత్ర అవార్డుతో సత్కరించింది. మానవ విలువలు మృగ్యమైపోతున్న నేటి ఆధునిక సమాజంలో కుటుంబ బంధాలకు అనుబంధాలకు విలువనిస్తూ.. బంధువులు, స్నేహితుల ఇంట జరిగే వేడుకులలో కలసికట్టుగా వెళ్లి ఆశీర్వదించి రావడం విశేషం, వీరి ముగ్గురు సోదరులను వారి మిత్రులు కూడా సోదర సమేతంగా ఆహ్వానించడం పరిపాటి..సమాజ సేవా కార్యక్రమాల్లో ముందుకు సాగుతున్న ఈ అన్నదమ్ముల అనుబంధం ఇలాగే ఆదర్శవంతంగా మనందరికీ మార్గదర్శకంగా రాబోవు తరాలకు సాక్షీభూతంగా నిలవాలని ఆకాంక్షిస్తూ.. జాతీయ అన్నదమ్ముల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ అభినందనలు అందజేస్తున్నాం...

# యోగా అవగాహన కోసం స్వచ్ఛందంగా ముందుకు రావాలి

-ఇందులో భాగస్వామ్యం అయ్యే వారి వివరాలు

వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి -జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి



**రాజమహేంద్రవరం, మేజర్‌న్యూస్ :** యోగాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో పాల్గొనే వారంతా తప్పనిసరిగా తమ వివరాలు తప్పనిసరిగా వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియ జేశారు. 2025 జూన్ 21న అంతర్జా తీయ యోగా దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలన్నారు.ఈ నేపథ్యం లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యోగాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు.యోగా కార్యక్రమంలో పాల్గొనే వారందరూ రిజిస్ట్రేషన్ చేసుకున్న తదుపరి,వారికిఐదురోజులశిక్షణ ఉంటుంద న్నారు. తదుపరి వారికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను జారీ చేస్తారని తెలియజేశారు. యోగ పై తూర్పు గోదావరి జిల్లాలో పోటీలు నిర్వహిస్తారని, జిల్లా స్థాయి విజేతలకు జూన్ 21న ప్రధానమంత్రి హాజరయ్యే విశాఖపట్నంకార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలియజేశారు. వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ ట్యాబ్ కింద పేరు, ఆధార్ నంబర్, మొబైల్ నెంబర్, చిరునామా తదితర వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకో వచ్చని తెలియజేశారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని చెప్పారు. ప్రధాని కార్యక్రమంలో పాల్గొనాలన్న ఆసక్తి కలవారు రిజిస్ట్రేషన్ సమయంలో సంబంధిత వాళ్ళ వివరాలతో విశాఖపట్నం ఆప్షన్ ఎంచుకో వచ్చని చెప్పారు. మానసిక, శారీరకఆరోగ్యానికి, వ్యాధుల నివారణకు యోగ దోహదం చేస్తుందని, కనుక ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవనంలో భాగంగా చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

# మద్యం దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలను పాటించాలి






**పెద్దాపురం,మేజర్‌న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్, డిప్యూటీ కమిషనర్ వారి అదేశముల మేరకు మద్యం దుకాణాల వద్ద ఎంఆర్‌పి ఉల్లంఘన మరియు మద్యం దుకాణాల టైమింగ్ నియంత్రణలో భాగంగా పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధి లో గల మద్యం దుకాణాల వద్ద జిల్లా ఎక్సైజ్ అధికారులు మరియు పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కెవివి దుర్గార్జున రావు,సిబ్బంది రాత్రి పెట్రోలింగ్ కార్యక్రమం చేపట్టారు,దీనిలో భాగంగా మద్యం దుకాణాల వద్ద ఎంఆర్‌పి ఉల్లంఘన, మరియు టైమింగ్ నియంత్రణ అతిక్రమించినచో వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుంది అని ఎక్సైజ్ అధికారులు తెలిపారు

# యోగాంధ్ర ప్రోగ్రామ్‌ను సద్వినియోగం చేసుకోండి

-వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ



**రాజానగరం, మేజర్‌న్యూస్ :** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న యోగాంధ్ర ప్రోగ్రామ్‌ను విశ్వవిద్యాలయంతో పాటు ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలలు సద్వినియోగం చేసుకోవాలని వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో శ్రీ రాపర్తి రామ ఇన్స్టిట్యూట్ ఆఫ్ యోగా వారి సహకారంతో యోగాంధ్ర 2025లో భాగంగా ఉచిత ఆన్లైన్ యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆన్లైన్ యోగా ప్రోగ్రామ్‌కు హాజరైన వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ మే 21 నుండి జూన్ 21 వరకు ప్రతి రోజు ఉదయం 7 గంటల నుండి యోగాంధ్ర ప్రోగ్రామ్ జరుగుతుందని, దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. "యోగ ఫర్ వన్ ఎర్త్ - వన్ హెల్త్" అనే నినాదంతో ఈ సంవత్సరం అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకుంటున్నామని, ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన యోగాంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యమై ఆరోగ్యంగా జీవించాలన్నారు. యోగ సాధనను ప్రతిరోజు చేయడం ద్వారా ఎన్నో శారీరక, మానసిక ప్రయోజనాలు ఉన్నాయని తెలియజేశారు. తరువాత యోగా గురువు ఎన్. శివశంకరరావు దండాసనం, వృక్షాసనం, సర్వాంగాసనం, అమృతాసనం వంటి ఆసనాలు వేయించి, యోగాసనాల ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి. సుధాకర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

